


రచన: ఎ. సూర్యారావు

కళ్ళు తెరిచే సరికి ఎదురుగా యెత్తైన కొండలు కనిపించినై. ఆ కొండల మీద నుంచి చల్లని గాలివచ్చి శరీరాన్ని తాకి మనస్సుకు ఉత్తేజాన్ని కలిగిస్తోంది. ఏవో విచిత్రమైన కొత్తధ్వనులు వినిపిస్తున్నై. యిది కలా— నిజమా?— ఒక క్షణం దిగ్భ్రాంతి చెంది కళ్ళు నులుముకొని తిరిగి చూశాను. తిరిగి అవే కొండలు, ఉన్నతాలైన కట్టడాలు కనిపిస్తున్నై. అప్పుడు జ్ఞాపకం వచ్చింది. నిన్నటి నా ట్రైన్ ప్రయాణం— రాత్రి పట్నం చేరడం— మామయ్యగారి యిల్లు వెతికి తెలిసికొని డాబామీద పడుకోవడం— అన్నీ వరసగా జ్ఞాపకం వచ్చినై; ప్రయాణపు బడలికవల్ల వళ్ళు తెలియకుండా నిద్రపోయాను. ఉదయం లేచి ప్రయాణమే మరిచిపోయి ఎదురుగా రోజూ కనిపించే మీనాక్షి మేడకేసి చూసేసరికి మేడగాక కొండలు కనిపించినై; ఇది మండపేట కాదన్న విషయం అప్పుడు జ్ఞాపకం వచ్చింది— యిక నేను ఈ నూతన వాతావరణంలో జీవితం సాగించాలి సాయంత్రం వేళ పచ్చని పొలం గట్లమీద తిరిగేందుకు ఆ స్నేహితులూ దొరకరు, ఆ పొలాలు లేవు. ఈ పట్నం నాకళ్ళకు చాలా వింతగా కనిపిస్తోంది. పట్నంలో నావంటి యువకులు చెడిపోవడానికి అవకాశాలు ఎక్కువని నాన్నగారి నమ్మకం. అందుకు కారణం లేకపోలేదు. పట్నం చదువుకు వెళ్ళిన శాస్త్రి, రామం ఆరోగ్యం పాడుచేసుకుని యింటికి రావడం నేను మరిచిపోయినా నాన్నగారు మాత్రం మరిచిపోలేదు. అందుకని పట్నంలోని ఏ ఆకర్షణకూ లొంగ కూడదని నిగ్రహశక్తి అవసరమని ఒక రోజంతా ఉపన్యసించి పంపించారు. పట్నం యెలా వుంటుందో పట్నంలోని ఆకర్షణలు ఎటువంటివో నాకు యింత వరకూ ఏమీ తెలియదు. స్త్రీలు శరీర సౌందర్యాన్ని ప్రస్ఫుటం చేసే గౌనులతో బీచిలో తిరుగుతూ వుంటారని అందమైన మనుషులను చూసి చిరునవ్వులు విసురుతారని,

సైగలు చేస్తారని రామం చెబుతూవుంటే మేమందరం ఎంతో ఆసక్తితో వింటూ వుండేవాళ్ళం. అటువంటి దృశ్యాలు చూసే అదృష్టం మనకు కలగలేదు కదా అని మనస్సులో విచారించేవాళ్ళం.

మేడదిగి క్రిందకు వచ్చాను యింకా బద్ధకం పోలేదు. హాలులో అత్త కనిపించి దొడ్లో కొళాయి దగ్గరకు వెళ్ళి స్నానంచేసి రమ్మంది. కొళాయి దగ్గర కూర్చుని స్నానం చేస్తున్నాను. జువ్వి చెట్లు ధ్వనిచేస్తూ వూగుతున్నై. సూర్యుని లేతకిరణాలు తూర్పుదిశనుంచి వచ్చి నామీద పడుతున్నై. ఈ వాతావరణం నాలో యేదో నూతనోత్సాహాన్ని కలిగిస్తోంది. ఈవేళ కాలేజీ తెరుస్తారు. మరో నెలరోజులకు కొత్త స్నేహితులు దొరుకుతారు. పట్నం పాతపడుతుంది. హాయిగా కాలం గడపవచ్చు—గాజుల గలగల—బిందె శబ్దం నా ఆలోచనలను చెదరగొట్టినై. అటు చూశాను. ఒక యువతి నిద్రమత్తుతో ఒకవైపు జారిన పైటనైనా సవరించకుండా బిందెతీసుకొని ఒకఅడుగు ముందుకువచ్చి నన్ను చూసి వెంటనే ఇంట్లోకి వెళ్ళిపోయింది. యిది ఒక రెప్పపాటులో జరిగింది. కాని ఆమె రూపం మాత్రం హేండ్ కెమేరాతో తీసిన స్నాప్‌షాట్‌లా నా కంటిలో స్థిరంగా నిలిచిపోయింది. మామయ్యకు పిల్లలు లేరు కదా మరి ఎవరామె? వయస్సుకు తగ్గ సర్వాంగ సౌందర్యంతో ఎంతబాగుంది! అటువంటి నవయవ్వనితో ప్రణయ కలాపం—ఆ వాక్యం నా మనస్సులో పూర్తిగాకముందే మా నాన్న ఉగ్రరూపం నిగ్రహశక్తిని గూర్చిన ఉపన్యాసం జ్ఞప్తికి వచ్చాయి. పట్నంవచ్చి యింకా పన్నెండు గంటలైనా కాలేదు. అప్పుడే యేమిటీ పాడువూహలు. నా మానసిక దౌర్బల్యానికి విచారించి శరీరంతోపాటు మనస్సును కూడా శుభ్రంచేసి కొళాయి దగ్గరనుంచిలేచి యింట్లోకి వెళ్ళాను.

కాఫీతాగి నాకు యేర్పాటు చేసిన గదిలో కూర్చుని పుస్తకాలు ఫోటోలు సర్దడం ప్రారంభించాను. యింతవరకూ అపురూప సౌందర్యవతులుగా కనిపించిన నా అభిమాన సినిమా తారల ఫోటోలు అన్నీ—ఆ అమ్మాయిని చూసిన నా కళ్ళకు—చాలా వికృతంగా కనిపించినై. ఆ ఫోటోలన్నీ తీసి ఒకమూల పారేశాను. ఆ అమ్మాయి ఫోటో దొరికితే ఎంత బాగుండును! ఆమె పెదవుల కలయికలో ఏదో కొంటెతనం—ఆమె చూపులలో ఏదో ఆకర్షణ—అదుగో! తిరిగి ప్రారంభమైనై పాడు ఆలోచనలు! అసలు జారత్వం మహాపాపం అన్నాయి శాస్త్రాలన్నీ. బ్రహ్మచారిని గనక నాకు నిగ్రహం శాస్త్రరీత్యా మరీ అవసరం. అసలు పాటించ వలసివస్తే వితంతువుకు వున్న కట్టుబాట్లు అన్నీ విద్యార్థికి కూడా వున్నై. చన్నీటి స్నానం, చాపమీద పడకా, భోజనంలో కొన్ని నిషేధాలు వగైరా! సినిమాలో నాయకి ఆత్మలు రెండూ తెరమీదకు వచ్చి వాదించుకున్నట్లుగా నా మనస్సు ఆమెవైపు మళ్లుతుంది—బుద్ధి అది కూడదంటుంది.

చివరకు బుద్ధి జయించింది. మనస్సును చాలా వరకూ చదువు మీదికి మళ్ళిం

చాను. రోజులు గడుస్తున్నై. పట్నంలో చాలామందితో పరిచయం కలిగింది. నాకు అందరితో స్నేహంచేసే అలవాటులేదు. స్నేహితులు ఎక్కువ అవడం వల్ల కూడా కొన్ని యిబ్బందులు వున్నవని నా నమ్మకం. నాకు నా సహాధ్యాయు లందరిలోనూ చెప్పుకోతగ్గ స్నేహితుడు ఒకడే వున్నాడు. అతని పేరు ప్రసాదరావు. కొన్ని విషయాలలో చాల చురుకైన వాడు. అతని మాటల్ని బట్టి చాలా లోకజ్ఞానం వున్నవాడని పిస్తుంది. లోకజ్ఞానం అంటే ఖర్మం, ధర్మం, వేదాంతం అనికాదు ఈ నాడు లోకానికి సమాజానికి కలిగిన అన్ని సమస్యలనూ అర్థం చేసుకోగలవాడని. అతను నన్ను ఒకసారి వాళ్ళింటికి తీసుకు వెళ్ళాడు. యిద్దరం అతని రూములో కూర్చున్నాం. ఆ రూములో క్లాసుబుక్సు కంటే జనరల్ బుక్సు ఎక్కువగా కనిపించినై. అతను రెండు పుస్తకాలు తీసి నాకు చదవమని యిచ్చాడు. వాటిని తెరచి చూశాను; అవి సెక్సు సమస్యలను చర్చించే పుస్తకాలు. వాటిని చూడగానే నాకు చాలా భయంవేసింది—అవి నా మనస్సును ఎక్కడ చెరుస్తాయో అని. అతనితో మర్యాదగా "నేను ఇటువంటి పుస్తకాలు చదవను" అని చెప్పాను. అతను నావైపు ఒకసారి ఆశ్చర్యంగా చూసి "నీ ఉద్దేశం తప్పు" అన్నాడు. "అయితే అటువంటి పుస్తకాలు చదవవచ్చా?" అన్నాను ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ!

"చదవచ్చు! ఆ పుస్తకాలు చదివినందువల్ల ఎన్నో లాభాలువున్నై. మనుషుల మనస్తత్వాలను మనం గ్రహించగలుగుతాం. మనుషులు చెడిపోవడానికి కారణాలు తెలుసుకోగలుగుతాం. చెడకుండా వుండే మార్గాలను వూహించగలుగుతాం. దానివలన మనం లాభం పొందుతాం. మన స్నేహితులకుకూడా లాభాన్ని కలిగిస్తాం. ఇంకా మనలో ప్రతిభవుంటే సమాజాన్నికూడా బాగుపరుస్తాం!"

అతని మాటలువిని 'యితనికి యెటువంటి నిశ్చితాభిప్రాయాలు వున్నాయ్' అనుకున్నాను. అతనినుంచి నాకు తెలియని విషయాలు అన్నీ తెలుసుకోవాలని బుద్ధిపుట్టింది. అతనిని అడిగాను "సెక్సు సమస్యలు అంటే ఏమిటి? వాటికి సమాజానికి వున్న సంబంధం ఎటువంటిది?"

అతను ఒక క్షణం ఆలోచించి అన్నాడు. "నీకు ఆ సమస్యలనుగురించి నేను ఉపన్యాసం ఇవ్వను. నీ కళ్ళతో నీవే చూడవచ్చు. ఈరాత్రి 8 గంటలకు నువ్వొకసారి మా యింటికి రాగలవా?"

ఉపన్యాసాలను వినడంకంటే దృశ్యాలను చూడ్డానికి మనస్సు ఎక్కువ కుతూహల పడుతుంది. రాత్రి యిల్లు విడిచి పెట్టి వస్తే మామయ్య ఏమనుకుంటారో అని భయం. పర్యవసానం ఏమైనప్పటికీ రాత్రి 8 గంటలకు వస్తానని ప్రసాద్ కు మాటయిచ్చి యింటికి బయలుదేరాను. ఆలోచనలతోనే గదిలో అడుగుపెట్టాను. రెండవ అడుగు ముందుకుపడలేదు. ఆశ్చర్యంతో గుమ్మందగ్గర నిలబడ్డాను. ఆ

యువతి నా గదిలో కూర్చుని నా పుస్తకాలు ఒకొకటీ తీసి చూస్తోంది ఏమిటీ ధైర్యం! ఎవరిచ్చారు ఈమెకా చనువు? నా మనస్సును సరైన స్థితిలో పెట్టుకుని అన్నాను. "ఏ పుస్తకం కావాలో చెబితే మీకు శ్రమలేకుండా నేనే తీసియిస్తాను" ఈ మాటలకు ఆమె ఒకసారి ఉలికిపడి లేచినుంచుంది. గదిలోంచి బయటకు పోవడానికి ఒకఅడుగు ముందుకు వేసింది. గుమ్మం దగ్గర నేను నిలబడి వున్నందువల్ల ఆమె అక్కడే ఆగిపోయింది. "మీకు ఏ పుస్తకం కావాలో తీసుకు వెళ్ళండి!" అన్నాను. ఆమె ఒకసారి తల పైకిఎత్తి నావైపు చూసింది. ఆమె చూపులు నా చూపుల్ని తాకనై— మీ పుస్తకాల్లో నాకు కావలసిన పుస్తకం ఒకటీ లేదు" సమాధానం ఎంత నిర్భయంగా చెప్పింది.

దూరాన్నుంచి "విశాలా! విశాలా!" అన్న పిలుపు వినిపించింది. "అమ్మ పిలుస్తోంది!" అని నెమ్మదిగా అని గదిలోంచి బయటకు పరుగెత్తింది. ద్వారం చిన్నది కావడంవల్ల ఆ తొందరలో ఆమె చెయ్యి నాకు తగిలింది. ఆ స్పర్శ నాకు గంట సేపటి వరకూ గిలిగింతలు పెడుతూనే వుంది. ఆయువతి గది దాటిన ఉత్తర క్షణంలోనే అత్త నాగదిముందు ప్రత్యక్షమయింది. అత్తను చూచి చాలా భయపడ్డాను. ఆమె నాగదిలోంచి వెళ్ళడం అత్త చూసింది.

"విశాల చాలా మంచిపిల్ల; ఆమెకు నవలలు పత్రికలు అంటే ఎక్కువ ఇష్టం. మీ మామయ్య తెచ్చిన పత్రికలన్నీ చదువుతుంది. నన్ను పుస్తకం కావాలని అడిగితే నీగదిలో ఏమైనా పుస్తకాలుంటే తీసుకో ఫరవాలేదని నేనే ఆమెను నీగదిలోకి పంపించాను" అంది అత్త.

అంతటితో నాభయం తీరిపోయింది. కాని పుస్తకాల్లో ఆమెకు కావలసిన పుస్తకం ఒకటీ దొరకనందుకు చాలా విచారించాను. ఆమె దృష్టిలో నేను చాలా అసమర్థుడిగా కనిపించానేమోనని జడిశాను.

ఆరాత్రి ఒక స్నేహితునియింటికి వెళ్ళి వస్తానని అత్తతో చెప్పి బయలుదేరాను. నేను వెళ్ళేసరికి ప్రసాద్ పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. నన్ను చూడగానే పుస్తకం మూసి "రా! కూర్చో!" అన్నాడు. నేనుకూడా కూర్చున్నాను. టైము ఎనిమిదిగంటలయింది. గడియారం తొమ్మిదిగంటలు కొట్టేవరకూ మాట్లాడుతూ కూర్చున్నాం. తరవాత ప్రసాద్ నన్ను వాళ్ళ మేడమీదకు తీసుకు వెళ్ళాడు. మేడమీద గదికిటికీకి తిన్నగా రెండుకుర్చీలు వేశాడు. యిద్దరం కూర్చున్నాం. అప్పుడు ప్రసాద్ అన్నాడు. "అదుగో—మనకు తిన్నగా వున్న ఆ డాబావైపు చూస్తూవుండు. పది నిముషాలలో నీకు కొన్నిదృశ్యాలు కనిపిస్తాయి. కాని నువ్వేమీ ఉద్రేకపడకు సుమా!"

ఆ డాబా మేము కూర్చున్న మేడకు చేర్చివుంది. వెన్నెలలో ఆ ప్రదేశం మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. చల్లని గాలి వీస్తోంది. నేను అటువైపే

దీక్షగా చూస్తూ కూర్చున్నాను. సరిగా పదినిమిషాలు గడచిన తరవాత సముద్రం లోంచి పైకివస్తున్న చంద్రబింబంలా ఒక యువతి ఆ మెట్లలోంచి డాబామీదకు వచ్చింది. ఆమె ముఖం అస్ఫుటంగా కనిపిస్తోంది. నా కంటికి సౌందర్యవతిలా కనిపించలేదు. కాని ఆమె యవ్వనారంభంలో వుంది. ఆ డాబామీద ఆమె కొన్ని నిముషాలు ఒంటరిగా వుంది. ఆమెను ఆ పరిస్థితులలో ఎవరు చూసినా ఎవరి కోసమో వేచివున్నదని గ్రహించవచ్చు. యింతలో ఒక యువకుడు డాబామీదకు వచ్చాడు. ఆమె అతనిని సమీపించింది. అతను ఆమెను కౌగలించుకొని ముద్దు పెట్టుకున్నాడు. తరవాత వాళ్ళిద్దరూ డాబామీది మరొకవైపుకు అదృశ్యమయ్యారు.—నేను ఆశ్చర్యంగా ప్రసాద్ ముఖంలోకి చూశాను. అతని ముఖంలో ఆశ్చర్యానికి బదులు విషాదం కనిపిస్తోంది. అతను నెమ్మదిగా అన్నాడు "అదృశ్యం యింతటితో అయిపోలేదు. ఇంకావుంది. మనం మరోగంట ఇక్కడ వేచివుండాలి. అప్పుడు సెక్సు సమస్యలంటే ఏమిటో—వాటిని చర్చించి తెలుసుకో వలసిన అవసరంవుందో లేదో నువ్వే తెలుసుకోగలవు. ఆయువకుణ్ణి చూశావా? అతను మన కాలేజీలోనే బి. ఏ. చదువుతున్నాడు. చాలా ప్రమాదమైన మనిషి. అతని ముఖంచూస్తే ఎంతో మంచివాడనిపిస్తుంది. కాని లోకంలోని దుర్మార్గులలో ఒకడు. అతడు ఎందరో అమాయకపు యువతుల్ని చెరచాడు. వాళ్ళను పెళ్ళి చేసుకుంటానని ఎర చూపాడు. అతనికి పూర్వమే పెళ్ళి అయిందన్న విషయం వాళ్ళకేం తెలుస్తుంది పాపం! నేటి సమాజంలో యువతిని చెరచడం చాలా సులువు. స్త్రీకి మన సమాజం ప్రపంచ జ్ఞానాన్ని యివ్వదు. నేటికి కూడా విద్య స్త్రీకి వద్దంటుంది. యిక సెక్సు సమస్యలా! ఆమాట స్త్రీ నోటి నుంచి వస్తే యింకేమైనా వుందా! యీ వాతావరణంలో స్త్రీ చెడడానికి ఎంత కాలం పడుతుంది? అయితే ఆ యువకుడు ఆ అమ్మాయికోసం ఎంతకాలం నుంచో వేచి వున్నాడు. చివరకు ఆ అమ్మాయి వున్న యింట్లోనే మరో భాగంలో వుంటున్న ఒక కాలేజీ విద్యార్థితో స్నేహం చేశాడు. ఆ విద్యార్థికి సంగీతంలోనూ నృత్యంలోనూ కొద్దిగా పరిచయంవుంది. యిప్పుడు నీకు కనిపించిన యువతి చెల్లెల్ని అతను లోబరచుకున్నాడు. ఆ యువకుడు తన స్నేహితుని ప్రియురాలి ద్వారా ఈ యువతి మనసు మళ్ళించాడు. యిప్పుడు అక్కను అక్క ప్రియుణ్ని డాబామీదకి పంపి ఆ చెల్లెలు దిగువ మేడమెట్లదగ్గర కాపలా కాస్తోంది. ఎవరైనా వస్తే ఆమె చప్పుడు చేస్తుంది. ఆ సౌంజ్ఞవిని వీళ్ళిద్దరూ రెండవ వైపు మెట్లమీదినుండి క్రిందకు వెళ్ళిపోతారు."

యింతలో ఆ యువతీ యువకులు డాబామీలనుంచి వచ్చి మెట్లలోంచి క్రిందకుదిగిపోయారు. మరో అయిదు నిముషాలు గడవగానే మరోజంట డాబామీద కనిపించారు. ఈ యువకుడు కొంచెం పొడవుగా వున్నాడు. యీ

యువతి — ఈమె యింకా యువతి కాదు–చాలా చిన్నదిగా కనిపిస్తోంది. వాళ్ళిద్దరూ ప్రణయకలాపంలో ప్రపంచాన్ని మరిచిపోయారు. నాకు చాలా ఆశ్చర్యంకలిగింది. ప్రసాద్‌తో అన్నాను.

"ఈమె చాలా చిన్నదిగా కనిపిస్తోంది!"

ప్రసాద్ ఒక నిట్టూర్పు విడిచి అన్నాడు, "అవును ఈమె చాలా చిన్నది. యుక్తవయసువచ్చి యింకా మూడు నెలలుకూడా కాలేదు. ఈ చిన్నపిల్ల వాళ్ళఅక్క—అంటే యిప్పుడు మేడదిగిన యువతి మనస్సు మళ్ళించ గలిగిందంటే ఎవరూ నమ్మలేరు. కాని యీమే ఆమెను చెరచింది. యీమె మనస్సు బాల్యంలో నేకలుషితమయ్యింది. దానికి కారణం వీళ్ళిద్దరికంటే పెద్దది ఒక అక్కవుండేది వీళ్ళకు. ఆమె సహవాస దోషంవల్ల బాల్యంలోనే చెడిపోయింది. ఆమె తన ప్రియులకు తన చెల్లెళ్ళలో అప్పటికి చిన్నదయిన యీ పిల్లతో ప్రణయ లేఖలు పంపేది. పెద్దవాళ్ళ మనస్సు కంటే పిల్లల మనస్సు అతి సూక్ష్మమైనది. ఎటువంటి విషయమైనా వాళ్ళ మనస్సుపై తేలికగా ప్రతిబింబిస్తుంది. పిల్లలేకదా వాళ్ళకేమీ తెలియదనుకొని పెద్దవాళ్ళు పిల్లలముందే అన్ని విషయాలూ మాట్లాడు కుంటారు. అది చాలా తప్పు– యిలా వుండగా యీ పిల్లల అక్కకు గర్భం వచ్చింది. కాని ఆమె అప్పటికి అవివాహిత. ఆమె తన ప్రియులలో ఒకణ్ని పెళ్ళి చేసుకోమని ప్రబతిమాలింది, పెళ్ళికి బదులు అతను ఆమెకు గర్భస్రావానికి మందు తీసుక వచ్చి యిచ్చాడు. ఆమె ఆమందు వేసుకొంది. నాలుగు రోజులలో గర్భస్రావం జరిగింది. కాని క్రమేణ ఆమె ఆరోగ్యం చెడిపోనారంభించింది. యువ్వనమంతా ధ్వంస మయ్యింది. తనతోటి యువ్వను లంతా యింకా సర్వాంగ సౌందర్యంతో వుంటే అప్పుడే తన యవ్వనం ధ్వంసం కావడం ఆమె చూచి సహించలేక పోయింది. చివరకు విషంత్రాగి ప్రాణత్యాగం చేసింది. యిప్పుడు నాకు కనిపించిన వాళ్ళు ఆమె చెల్లెళ్ళు. వాళ్లుకూడా ఆమె నడచిన దారినే నడుస్తున్నారు. పాపం! ఈ తరగతి మనుషులకు తాత్కాలిక సుఖంమినహా భవిష్యత్తును గురించి ఆలోచనలు వుండవు—ఇలా యెన్నో కుటుంబాలు ధ్వంసమవుతున్నాయి. కాని సమాజం ఆ కుళ్ళును దాస్తుంది—స్త్రీ పురుష సమస్యలంటే ఏమిటో వాటిని చర్చించి తెలుసుకోవలసిన ఆవశ్యకత వుందోలేదో ఇప్పటికైనా నీకు తెలిసిందా?" నా ముఖంలోకిచూస్తూ ప్రశ్నించాడు ప్రసాద్.

కాని నా నోటినుంచి ఒక మాట కూడా రాలేదు. నా మనస్సు ఏదో ఆవేశంతోనూ, ఆవేదనతోనూ నిండింది. పాపం! ఈపిల్లల భవిష్యత్తు ఏమవుతుంది? వీళ్ళుకూడా సమాజంలో కులటలుగా జీవితం గడపాలా?—యింతలో గడియారం పదకొండు గంటలు కొట్టింది. "రేపు కలుసుకొని మాట్లాడదాం" అని ప్రసాదుతో చెప్పి మానసిక వ్యధతో

యిల్లు చేరాను. కాని ఆ రాత్రి నాకు సరిగా నిద్రపట్టలేదు.

* * *

ఆరోజు ఆదివారం. ప్రసాద్ ఇచ్చిన పుస్తకం చదువుతున్నాను. క్షణక్షణం మామయ్యకోసం ఎవరో వస్తూ నా చదువుకు భంగం కలిగిస్తున్నారు. మొదటి గదిలోనే నేను వుండడంవల్ల వచ్చిన వాళ్ళంతా నన్ను పరామర్శించడం, మామయ్య మంచితనాన్ని గురించి ఉపన్యసించడం, తరవాత తాము వచ్చినట్లు మామయ్యకు కబురు చెప్పమనడం, నేను పుస్తకం మూసి మామయ్యకు కబురు చెప్పిరావడం, వగైరా కార్యక్రమం జరగడం ప్రారంభమయ్యింది. యిక యీ ఉదయం ఎలాగా చదువుసాగదనే నిశ్చయానికి వచ్చి పుస్తకం మూసికూర్చున్నాను. మామయ్యకు ఎంతపలుకుబడివుంది! చాలా మర్యాదయిన మనిషి. ఏ చిన్న లోపం కూడా ఆయనలో నాకు కనిపించలేదు. అందరూ ఆయన మంచితనాన్ని గురించే చెబుతారు. యింతలో ఆకస్మికంగా నాకు తిన్నగావున్న కిటికీలో మెరుపు మెరిసింది. ఊహా జగత్తులోంచి దిగి అటు చూశాను. ఆమె ఆగదిలో బల్లమీద కూర్చుని వయొలిన్ తీసి వాయించడం ప్రారంభించింది. నా కిటికీలోంచి ఆమె కదలికలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నై. తీగెల మీద ఆమె వేళ్ళు పరుగులెత్తుతున్నై. ఆ సంగీతం మనోజ్ఞంగా వీనులను తాకి మనలో దాగివున్న ఏవో కోరికలను రేకెత్తిస్తోంది. ఆ వేదనతో ఆశతో నన్ను నేను మరచి ఆమె పెదవుల వైపు ఆమె కళ్ళవైపూ, నృత్యంచేసే వేళ్ళ వైపూ చూస్తున్నాను. ఆస్థితిలో నేనెంత సేపు వున్నానో నాకు ఇప్పుడు జ్ఞాపకం లేదు. ఆ సమయంలో మరో స్త్రీ ఆమె గదిలో అడుగు పెట్టింది. సంగీతం ఆగింది. ఆ స్త్రీ నిండుయవ్వనంలో వుంది. దానికితోడు అందంకూడా వుంది. ఆమె విశాల రెండవతల్లి. విశాల తల్లిపోయిన తరవాత వాళ్ల నాన్నగారు యీమెను తిరిగి వివాహం చేసుకున్నారట. విశాల నాన్నగారు ఏదో కంపెనీ ఏజంటు. నెలకూ రెండు నెలలకూ ఒకసారి ఇంటికివచ్చి ఆయన తిరిగి వెళ్ళిపోతుంటారు. ఆకుటుంబం మామయ్యగారి కుటుంబంలా చాలా అన్యోన్యంగా వుంటారు. ఆమె విశాల గదిలో అడుగు పెట్టగానే నా వైపు అనుమానంగా చూసింది. విశాల ఆమె వెనుకనుంచి నావైపు ఒక చిరునవ్వు విసరి ఆ గదిలోంచి వెళ్ళిపోయింది. నేను ఆచోటు విడిచిపెట్టి నా స్థానంలో కూర్చున్నాను. ఆరోజు విశాల నా గదిలో కనిపించి తొలిసారిగా మాట్లాడినది మొదలు ఆమె నేనెప్పుడు కనిపించినా ఒక చిరునవ్వు విసిరి వెళ్ళిపోవడం ప్రారంభించింది. ఆమెలో యీమార్పు ఏరకంగా కలిగిందో తెలియదు. కాని ఆమెలోని ఈ లక్షణం నాకేమీ సంసారి లక్షణంగా కనిపించలేదు. అలా అని ఆమెనుచూచి తిరిగి నవ్వకుండా వుండనూ లేకపోయాను. ఇది నిజంగా మానసిక దౌర్బల్యమే. ఆమె మంచిది కాదని అనుమానించికూడా మనసు ఆమెనే ఎందుకు కోరాలి? ప్రణయ సమస్యలలో అనుమా

నం, అసూయ ఈ రెండూ రాహుకేతువులలా ఎదొరొస్తూ వుంటాయనుకుంటాను.—ఆమె మంచిది కాదనే అనుమానానికి మరో కారణం వుంది. నిన్న రాజూ నేనూ నా గదిలో కూర్చుని మాట్లాడుతూవుంటే విశాల ఎప్పటిలా కిటికీ దగ్గరకువచ్చి చిరునవ్వు విసిరివెళ్లింది. మరో మనిషి ఉండగా నవ్వడంలో ఆమె ఉద్దేశమేమిటి? ఆమె వాణ్ని చూసి నవ్వినట్లా? నన్నుచూసి నవ్వినట్లా? వెంటనే వాడు నన్ను అడిగాడు.

"ఎవరు ఆ అమ్మాయి?"

తప్పనిసరిగా సమాధానం చెప్పవలసి వచ్చింది. "ఆ పోర్షన్‌లో ఉంటున్న వారి అమ్మాయి!" నా సమాధానం విని వాడు వూరుకోవాలి. కాని వూరుకోలేదు.

"ఏం ఛాన్సురా నీది! నువ్వేగనక వూరుకుంటున్నావు. నేనే యీ స్థితిలో వుంటేనా!" అన్నాడు. ఈ మాటలు చాలామంది అనగా విన్నాను. వీటి అర్థం ఎదుటి మనిషికి కలిగిన అదృష్టానికి అసూయ పడడం కంటే వేరే ఏమీ లేదు. తన అసూయని కప్పిపుచ్చుకోవడం కోసం ఎదుటి మనిషిని అసమర్థుడిగా కట్టి సంతృప్తి పడడం. నిజంగా నా స్థితిలో ఎవరువున్నా వాళ్ళకు కూడా నాకు కలిగిన సమస్యలే కలుగుతాయని నా నమ్మకం. ఒక వేళ నాలో నిజంగా సాహసం తక్కువేమో! నాలో సాహసం తక్కువ కావడానికి కారణం మామయ్య మర్యాద. నేను అటువంటి చెడు వ్యవహారాలలో దిగితే మామయ్య మర్యాదకు భంగం కాదా? మామయ్య ఎంతమంచివాడు! ఆయనకు ఎంతపేరు వుంది!

ఒకనాటి సాయంత్రం పుస్తకం చదువుతూ కూర్చున్నాను. ఆ క్షణంలో మామయ్య పొడుగుపాటి రూపం నా గదిలో ప్రత్యక్షమయ్యింది. ఆయన వచ్చి సోఫాలో నా ప్రక్కనే కూర్చున్నారు. నా చేతిలో పుస్తకం చూసి "ఆ పుస్తకం ఒకసారి చూడనీ!" అన్నారు. జడుస్తూ ఆపుస్తకం ఆయనచేతిలో పెట్టాను. ఆయన ఒకసారి ఆ పుస్తకం పుటలు తిప్పిచూసి "నీకు బాగుపడాలని లేదా?" అని సూటిగా ప్రశ్నించారు. నేను భయంతో ఆయనవైపు మౌనంగా చూస్తున్నాను. ఆయన కళ్ళలో కోపం కనిపిస్తోంది. ఒక నిముషం వూరుకొని తిరిగి ప్రారంభించారు. "ఈ కాలపు కుర్రాళ్లు చెడిపోవడానికి ఈ పుస్తకాలే కారణం. యిటువంటి పుస్తకాలు చదివి చెడుసావాసాలు చేసి ఎందుకూ పనికిరాకండా తయారవుతున్నారు. మిమ్మల్ని చూస్తూవుంటే సమాజంలో కొంతకాలానికి నీతి నియమాలు అనే పదానికి అర్థం లేకుండా చేస్తారేమోనని భయంవేస్తోంది.—నీకు బాగుపడాలని వుంటే యిటువంటి పుస్తకాలు విడిచిపెట్టి క్లాసు పుస్తకాలు చదువు!" ఇంతలో మామయ్యకోసం ఎవరోవచ్చి పిలవడంవల్ల ఆయన వెళ్ళిపోయారు.

ప్రసాద్ మాటలకు మామయ్య మాటలు కేవలం వ్యతిరేకం. ఇటువంటి పుస్తకాలు చదివితే బాగుపడతారంటాడు ప్రసాద్ : చెడిపోతారంటాడు మామయ్య. నా

స్నేహితులలో చెడుత్రోవలలో నడిచే వాళ్ళు కొందరువున్నారు. వాళ్ళ తత్త్వాలు నాకు బాగా తెలుసు. సెక్సు పుస్తకాలు ఎలావుంటాయో కూడా వాళ్ళకు తెలియదు. వాళ్ళలో ఒక సెక్సు పుస్తం చదివినవాడు కాని అథమం నాలుగు పుటలు చదివినవాడుగాని లేనేలేడు. అయినా వాళ్ళు చెడిపోయారు. అయితే వాళ్ళు చెడిపోవడానికి కారణం ఏమిటి? సెక్సు విజ్ఞానం లేకపోవడమే కారణ మంటాడు ప్రసాద్. ఇక అతని మాటల్ని బలపరచక నాకు గత్యంతరం లేదు. నేటి సమాజం కలుషిత మవడానికి కారణాలు అతను ఉదాహరణ పూర్వకంగా నా కళ్ళకు చూపించాడు. అటువంటప్పుడు అతని మాటల్ని కేవలం పనికిరాని మాటలుగా ఎలా తీసుకోగలను!

నౌకరువచ్చి గదిలో లైటు వెలిగించి వెళ్ళాడు. చీకటి పడిన విషయం నాకు అప్పుడు జ్ఞాపకం వచ్చింది. కలవరపడుతున్న మనస్సుకు కొంత ప్రశాంతత నివ్వడంకోసం ఎవరూలేని నిశ్శబ్దమైన చోటు కావాలి. ఆలోచనతో బరువుగా అడుగులు వేస్తూ డాబామీదికి వెళ్ళాను. నక్షత్రాలమధ్య చంద్రుడు నవ్వుతున్నాడు. చంద్రుణ్ని చూసి సముద్రం ఉప్పొంగుతోంది. ప్రకృతికీ ప్రణయానికి ఏమిటో సంబంధం! ప్రణయాన్ని మనుషులు—ముఖ్యంగా రాజకీయనాయకులు వేదాంతులు—ఎందుకు అంత నీచంగా చూస్తారు! ప్రతిమానవుడు అనుభవాలతో వృద్ధుడయిన తరువాత తః జీవితాన్ని ఒక సారి సింహావలోకనం చేసుకుంటే తన జీవితంలో తను చేసిన ఘనకార్యాలతో పాటు యౌవనం—యౌవనంలోని ప్రణయఘట్టాలు జ్ఞాపకం వస్తాయి. తనలో తానే గర్వపడతాడు. సంతోషిస్తాడు. లేదా విచారిస్తాడు. కాని పైకి చెప్ప లేడు. ఇంత ముఖ్యమైన ప్రణయ సమస్యను సమాజం యెందుకు తొక్కి పెడుతుంది? నేటి యువకుడు ప్రణయాన్ని పైకి ద్వేషిస్తాడు. లోపల కాంక్షిస్తాడు. ఇక మామయ్య వంటి మనుషుల మనస్తత్వాలు తెలుసుకోవడం మరీకష్టం—ఇంతలో నా వెనుక గాజుల శబ్దం వినిపించింది. ఆలోచనా సాగరం లోంచి దృష్టిని మళ్ళించిచూశాను. గోడ క్రీనీడలో విశాలనుంచుని వుంది. ఆమె ఎంతసేపటి నుండి అక్కడ నుంచుని వుందో! నేను ఆమె వైపు చూడనందుకు బుద్ధి పూర్వకంగా గాజుల శబ్దం చేసివుంటుంది. ఆమె దగ్గరకు వెళ్ళాను. నన్ను చూసి ఆమె తలవొంచింది.

"ఎంత సేపు అయ్యింది విశాలా నువ్వు వచ్చి?" అన్నాను. "మీకంటే ఒక అరగంట ముందు!" నెమ్మదిగా అంది. ఆమె గొంతులో ఆవేదన స్పష్టంగా కనిపిస్తోంది. ఎందుకో! "నేను రావడం నువ్వు చూశావా?" ఆమె తల ఊపింది.

"మరి నన్నెందుకు పిలువలేదు విశాలా? నువ్వు ఒంటరిగా అంతసేపటినుండి ఎందుకువున్నావ్ ఇక్కడ? నాలా నువ్వు కూడా ఏమైనా సమస్యలతో బాధపడుతున్నావా?"

"మగవాళ్ళకేగాని ఆడవాళ్ళకు సమస్యలుండవా? మీకు ఏవైనా సమస్యలు కలిగితే మీ స్నేహితులతో మీరు చెప్పుకోగలరు. కాని మాకు అందుకు కూడా వీలులేదు. ఆడదానికి కలిగిన సమస్యలు ఆమె హృదయంలోనే పరిష్కారం కావాలి! బయటకు రావడానికి వీలులేదు."

ఆమె మనస్సులో దిగులుగా వుందనడానికి యేమీ సందేహంలేదు. ఆమె చుబుకాన్ని పట్టుకొని ముఖంలోకిచూస్తూ "నన్ను స్నేహితునిగా స్వీకరించి ఆ సమస్య లేమిటో నాకు చెప్పకూడదా?" అన్నాను.

"ఊహుం! కొంచం దూరంగా వుండండి!—మిమ్మల్ని చూస్తూవుంటే సమాజంలో కొంతకాలానికి నీతి నియమాలు అనే పదానికి అర్థంలేకుండా చేస్తారేమోనని భయం వేస్తోంది."

ఈ మాటలు ఎలక్ట్రిక్ షాక్‌లా పనిచేసినై. ఇవి సరిగా మా మామయ్య అన్న మాటలు. ఆమె ముఖంలో హేళనతో కూడిన నవ్వు కనిపిస్తోంది.

నేను ఆశ్చర్యంగా "మామయ్య అన్న మాటలు విన్నావా?" అన్నాను.

"విన్నాను."

"అయితే నువ్వుకూడా నన్ను చెడ్డవాళ్ళలో లెఖ్ఖ వేస్తావా?"

"తప్పకుండా! రెండు గంటల క్రితం ప్రస్తకం చదివారు. అప్పుడేవచ్చి నన్ను పట్టుకున్నారు! మీరు చెడిపోయారనడానికి యింతకంటే పెద్ద నిదర్శనం ఏం కావాలి?" అంది నవ్వుతూ! ఆమె నవ్వు నా నరాల్లోకి విద్యుత్తును ప్రవహింప చేస్తోంది.

"నవ్వు పరిహాసానికి అనే మాటల్ని నేను పట్టించుకోను. కాని మామయ్య చాలా మంచివాడు. విశాలా! ఆయన మాటలు నన్నింకా బాధ పెడుతున్నై."

"మీ మామయ్య మంచితనాన్ని మర్యాదనీ మీరే మెచ్చుకోవాలి!"

మామయ్యవంటి మర్యాదస్తుణ్ణి ఆమె అంత చులకనగా మాట్లాడ్డం నాకేమీ నచ్చలేదు. ప్రసంగాన్ని మారుస్తూ "నిన్ను చూసిన తొలిచూపులోనే నేను పూర్తిగా మారిపోయాను విశాలా! కాని మామయ్య మర్యాదకు భంగం వస్తుందని జడిసి నా ప్రేమను నీకింత వరకూ తెలియ జేయలేక పోయాను!" అన్నాను ఆమెవైపు ఆశగా చూస్తూ!

"అయితే ఇప్పుడు మీరు మీ మామయ్య మర్యాదకు భంగం కలిగించదలచుకున్నారా?" ఆమెమాటలలోని హేళన నన్ను గిలిగింతలు పెడుతోంది.

"మర్యాదకు భంగం రాని ఉపాయం కోసం ఆలోచిస్తున్నాను."

"అయితే త్వరగా ఆలోచించండి!"

యిక ఆమె హేళన నేను భరించలేక పోయాను. నవయవ్వనిని కళ్ళముందు పెట్టుకొని యింతకాలం నిగ్రహంగా వుండడానికి నేనుజడుడను కాను. ఆమెను రెండు చేతులతోను హృదయానికి హత్తుకొని ఆమె పెదవులను ముద్దు పెట్టుకున్నాను. ఎన్నడూ ఎరుగని మత్తు ఏదో నాలో కలిగింది. ఆమె నున్నటి చెంపల్ని మెరిసే కళ్ళను ముద్దులతో నింపాను.

ఆమె నన్ను బలంగా వెనక్కు నెట్టింది. ఆమెను విడిచి పెట్టాను. ఆమె ముంగురులు చెదిరినై. పెదవులలో మార్పు కనిపించింది. ముఖంలో ఏదో కొత్త అందం కనిపించింది.

"నా మీద కోపం వచ్చిందా! విశాలా!" ఆమె కళ్ళల్లోకి చూస్తూ ప్రశ్నించాను.

"లేదు. కాని మన ప్రవర్తన వల్ల మన భవిష్యత్తుకు నష్టం కలుగని మార్గం ఆలోచించి అప్పుడు నన్ను తిరిగి కలుసుకోండి!" ఆమె డాబా దిగి వెళ్ళిపోయింది.

క్రిందనుండి పిలుపు వచ్చే వరకు అక్కడే ఆలోచిస్తూ వుండిపోయాను. ఆరాత్రి నాకు నిద్రపట్టలేదు. నామనస్సు ప్రణయాన్ని కాంక్షిస్తోంది. నా ప్రణయంకోసం ఒక స్త్రీ భవిష్యత్తును నాశనం చెయ్యవచ్చా? స్వార్థపరుడనై ఆమెతో ప్రణయం సాగించి నాచదువు పూర్తిచేసుకొని— ఆమె ఖర్మానికి ఆమెను వదిలి యీవూరు విడిచిపోనా? ఆమె తెలివైనదనడానికి ఈ ఒక్క ఘటనే చక్కని నిదర్శనం. నేను ఎంత ఉద్రేకపడినా ఆమె నిగ్రహంతో నన్ను వారించి తెలివిగా తప్పుకొంది.

వారంరోజులు గడిచి పోయినై. నేను యింకా ఒక నిశ్చయానికి రాలేకపోయాను. తెలివైన స్త్రీ తాత్కాలిక సుఖానికి లోబడక భవిష్యత్తును కోరుతుందనడానికి విశాల చక్కని నిదర్శనం. అయితే ఈ పరిస్థితిలో నేను చెయ్యవలసిన దేమిటి? అత్తవూళ్ళో లేనందువల్ల ఆమెతో స్వేచ్ఛగా మాట్లాడ్డానికి యిది మంచి అవకాశం. ఈ అవకాశాన్ని విడిచి పెట్టడానికి నా మనస్సు అంగీకరించడంలేదు. ఆ రోజంతా ఆమె కోసం ఎదురు చూశాను. ఆమెకు బదులు ఆమె పిన్ని ప్రతిక్షణం కనిపించ సాగింది. మొదటిసారి ఆమెను చూసి తలతిప్పాను. ఆమెవైపు దీక్షగా చూశాను. వయస్సు 25 సంవత్సరాలు వుంటుంది. ఆమె ముఖంలోకి చూసేకొద్దీ చూడాలని బుద్ధి పుట్టింది. పరిపుష్టమైన అవయవ సౌందర్యంతో నిండు యవ్వనంలోవుంది. ఆమె ఆరోజు ఎన్నోసార్లు కిటికీముందు కనిపించింది. ఆమె ఆఖరుసారి కిటికీదగ్గరకువచ్చి ఒకసారి బయటకు రమ్మని పిలిచింది. నాకు చాలా భయం వేసింది. బెదురుగా ఆమె గదివైపు నడిచాను. ఆమె ఏ ఉద్దేశంతో పిలిచిందో నాకు అర్థంకాలేదు. తలుపు దగ్గర నిలబడ్డాను ఆమెవైపుచూస్తూ.

"లోపలికి రా! నీతో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి!" ఆమె మాటలలో బెదురు, భయం ఏమీ లేదు. అప్రయత్నంగా లోపలికి అడుగువేశాను. ఎలక్ట్రిక్ దీపపు కాంతిలో ఆమె తల, చెక్కిళ్ళు మెరుస్తున్నై.

ఆమె నా చెయ్యి పట్టుకొని "నువ్వు విశాలవైపు ఎందుకు అలా చూస్తావ్?" అంది—ఆమె చేతిలో నా చెయ్యి నలిగిపోతోంది. ఆమె ముఖం నన్ను సమీపించింది. ఆమె కళ్ళు మెరుస్తున్నై. నా జీవితంలో ఎన్నడూ యెరుగని కొత్తస్థితికి వెళ్ళాను.

నిగ్రహం అనే మాట వుందన్న విషయం ఆక్షణంలో పూర్తిగా మరిచిపోయాను. ఆమె రెండు చేతులమధ్య నేను నలిగి పోతున్నాను. వెచ్చని ఉన్నతమైన ప్రదేశాలు నావక్షాన్ని అదిమి నన్ను వివశుణ్ణి చేస్తున్నై. నేనేం చేస్తున్నానో నేనన్నది ఏలోకమో నాకు తెలియడం లేదు. ఆమె ముద్దులతో నాకు ఊపిరి సలపడం లేదు. ఆమె చెక్కిళ్ళనూ పెదవులనూ నా పెదవులు వణుకుతూ ముద్దుపెట్టుకొంటున్నై. నేను తిరిగి బాహ్యప్రపంచంలోకి వచ్చేసరికి చాలా సమయం పట్టింది. నేను ఎత్తైన మంచంపై మెత్తని పరుపు మీద పడుకుని వున్నాను. ఆమె వెచ్చని చేతులు నన్ను వక్షానికి అదుము కొని వున్నై. సుఖ స్వప్నం లోంచి కళ్ళు తెరిచినట్లు ఆమె ముఖంలోకి చూశాను. ఆమె కళ్ళు తృప్తితో నవ్వుతున్నై.

నా జీవితంలో తొలిసారిగా ప్రమాదానికి గురి ఆయ్యానన్న విషయం నాకు అప్పుడు తెలిసింది. ఆమె చేతుల్లోంచి విడిపించుకొని "ఏం చేశారు మీరు!" అన్నాను కోపంగా.

ఆమె నవ్వుతూ "నేను పాపం చేశానంటావా? దీనిలో యింత ఆనందం దొరికే నప్పుడు అది పాపం అని ఎవరు నిరశించినా నాకేమీ అభ్యంతరం లేదు. నా విషయం ఆలోచించు. మా వారు రెండు నెలల కొకసారి యింటికి వస్తారు. ఆ రెండు నెలలు ఆయన యిష్టం వచ్చిన వూళ్ళల్లో యిష్టం వచ్చిన వాళ్ళతో గడుపుతూ వుంటారు. ఆయన సుఖం ఆయన చూసుకుంటారు. ఆయనకు ఏమీ పాపం రాదు. కాని నేను మాత్రం నిగ్రహంతో వుండాలి. అయితే నేను యంత్రాన్నని నీ ఉద్దేశం. నేను మనిషి నయినప్పుడు ప్రణయాన్ని కోరితే అది పాపం ఎలా అవుతుంది? అవివాహితవు భవిష్యత్తు వుంది గనక ఆమెకు నిగ్రహం అవసరం. మరి నామాట ఏమిటి? నా కిక భవిష్యత్తు ఏముంది? నేను అవన్నీ ఏనాడో ఆలోచించాను. యిక ఆశుష్క వాదాలు విడిచిపెట్టు— నీ జీవితంలో ఎన్నడూ ఎరుగని సుఖాన్ని నీకు నేనిచ్చాను. అందుకు నన్నభినందించి వెళ్ళిపో!"

ఆమె ఆజ్ఞానుసారం అక్కడినుండి బయటకు వచ్చి నాగదిలో పడుకున్నాను. ఆమె మాటలు నాలోని ముసలి ఉద్దేశాల నన్నిటినీ చెదరగొట్టినై. లోకంలో ఎంత విచిత్రమైన మనుషులు వుంటారు! ఎంతవింతైన సమస్యలువుంటాయి! పట్నం వచ్చిన ఈకొద్ది కాలంలో మానసికంగా ఎంతోపరిణతి పొందినట్లయ్యింది నాకు. ఆ ప్రణయవాహినిలో నా నిగ్రహం— మానాన్నగారిబోధ— మామయ్య మర్యాద అన్నీ కొట్టుకు పోయినై. ప్రణయానికి ఎంతశక్తి వుంది! దానిని కృత్రిమ మార్గాలలో తొక్కి పెట్టడం ఎవరిశక్యం! రాత్రి పదిగంటలయ్యింది. బయటబూటు చప్పుడు వినిపించింది. మామయ్య లోపలకు వచ్చాడు. మామయ్య ఇవేళ ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చాడో! అసమయంలో వస్తే యింకేమైనా వుందీ!— ఆరాత్రి వళ్ళు తెలియకుండా ఏదో తృప్తితో నిద్రపోయాను.

ఉదయం లేచే సరికి చాలా ఆలస్యమయ్యింది. బద్ధకంగా కాలకృత్యాలు తీర్చుకొని కాఫీ తాగుతూ కూర్చున్నాను. కిటికీలో విశాల కనిపించింది. ఏదో అపరాధం చేసిన వాడిలా ఆమె ముఖంలోకి చూడలేక పోయాను. ఆ రోజంతా బరువుగా బాధగా గడిచింది. నాలుగు రోజుల వరకూ నేను ఎప్పటి స్థితికి రాలేకపోయాను. విశాల ఎప్పటిలా నవ్వు ముఖంతో కనిపించడం వల్ల ఆమెకేమీ అనుమానం కలగలేదని తృప్తి పడ్డాను.

తిరిగి విశాలను ఒకసారి కలుసుకొని మాట్లాడాలని బుద్ధిపుట్టింది. ఆలోచనలతో ఆ రాత్రి నిద్రపట్టలేదు. 11 గంటలయ్యింది. ఇల్లు నిశ్శబ్దంగావుంది. నెమ్మదిగా లేచి చప్పుడు కాకుండా ముందుకు నడుస్తున్నాను. మామయ్య గదిదగ్గరకు వచ్చేసరికి గదిలోంచి స్త్రీ నవ్వు వినిపించింది. అత్త వూళ్ళో లేదుకదా ఎవరా స్త్రీ! కిటికీలోంచి చూశాను. నాకళ్ళను నేనే నమ్మలేకపోయాను. ఏ లోపం లేని మంచివాడనుకునే మామయ్య—నిగ్రహం వున్న మామయ్య—నేను చిక్కుకున్న కౌగిలిలోనే చిక్కుకుని వున్నాడు. ఏదో మహత్తర విషయాన్ని కనిపెట్టినట్లు తృప్తితో, సంతోషంతో, నిర్భయంగా ముందుకు నడిచి విశాలవున్న గదితలుపు తట్టేను.

"విశాలా! విశాలా!"

"ఎవరు?"

"కొంచం తలుపుతీద్దూ నీతో ఒక ముఖ్యమైన విషయం మాట్లాడాలి."

"ఈ కిటికీ దగ్గరకువచ్చి చెప్పండి!"

"లేదు. చాలా ముఖ్యమైన విషయం! నన్ను నమ్మి తలుపుతియ్యి! నిన్నేం చెయ్యను!"

గది తలుపులు తెరుచుకున్నై. గదిలో ప్రవేశించి ఆమె చెయ్యి పట్టుకొని "నాతోవాస్తే నీకు మంచిదృశ్యం చూపిస్తాను" అన్నాను.

ఆమె నవ్వుతూ "మీరు చెప్పబోయేది నాకు ఎంతో కాలం నుంచి తెలుసు!" అంది తేలికగా.

"ఏమిటి? మీపిన్ని మామయ్యల గురించి!" అన్నాను ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూస్తూ!

"అవును!" అంది విశాల.

నేను రెండు నిముషాలు నిశ్శబ్దంగా వుండి ఆమెతో అన్నాను. "మనం యిక యీ వాతావరణంలో నిగ్రహంతో వుండలేం విశాలా! నన్నేం చెయ్యామంటావో చెప్పు!"

"మీ మామయ్య మర్యాదను కాపాడమంటాను." నవ్వుతోంది.

"యిక ఆ హేళన విడిచిపెట్టి సరైన సమాధానం చెప్పు!" ఆమె భుజాలు పట్టుకొని ముఖంలోకి చూస్తూ ప్రశ్నించాను.

యింత సేపటినుండి లేనిసిగ్గు యేదో ఆమెకు కలిగింది. తలవొంచుకుంది. యిక భరించలేక పోయాను. ఆమెను దగ్గరకు తీసుకొని "త్వరగా చెప్పు" అన్నాను.

ఆమె ఎంతకాలంనుంచో మనస్సులో దాచుకొన్న కోరికను వెల్లడిస్తూ "యిక మనం శాశ్వతంగా యిలా వుండిపోదాం!" అని నన్ను దగ్గరకు తీసుకొంది.